క్లుప్తంగా

సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): బీజేపీ పశ్చిమ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని దాసాంజనేయ స్వామి ఆలయం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. హిందూ ఆలయాల్లో అన్యమతస్తులు, నేరస్తుల నియామకాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పశ్చిమ మండల అధ్యక్షుడు నడపన దాన భాస్కరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ, నాయకులు గాదిరాంబాబు, కట్నేని కృష్ణ ప్రసాద్, మేలక శ్రీకృష్ణ దేవరాయలు, చేకూరి గణపతి, ఇట్టాల కృష్ణారావు, ప్రక్కి మహేష్, గండికోట చిన్న రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో శ్రావణ నక్షత్రం పూజలు

భీమడోలు: భీమడోలులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు, వైఎస్సార్ సీపీ నేత వగ్వాల అచ్యుతరామారావు ఆధ్వర్యంలో స్వామి వారికి క్షీరాభిషేక పూజలు, శాంతి హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు, సాయి పవన్ ఆచార్యులు శాస్త్రోక్తంగా పూజలు చేసారు. పరిసర గ్రామాల భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

తెరుచుకున్న పాతూరు రైల్వే గేటు

భీమడోలు: జాతీయ రహదారికి పక్కనే ఉన్న పాతూరు రైల్వే ట్రాక్ అత్యవసర మరమ్మతులు పూర్తి కావడంతో సంబంధిత అధికారులు గేటును మంగళవారం మధ్యాహ్నం నుంచి తెరిచారు. దీంతో గేటు మీదుగా వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరులోని రైల్వే ట్రాక్‌ను ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు అత్యవసర మరమ్మతుల నిమిత్తం మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. వర్షాలు, సాంకేతిక సమస్యల నేపథ్యంలో ఆ పనులు 29న ఉదయం వరకు కొనసాగాయి. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయడంతో గేటు తెరుచుకుంది. యథావిధిగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు

భీమడోలు: గుండుగొలనులోని సీతారామ స్వామి ఆలయంలో మంగళవారం రాత్రితో వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా ముగిసాయి. తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న తరహాలో ఇక్కడ 51 ఏళ్లుగా పవిత్రోత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. నాలుగురోజులుగా కన్నుల పండువగా ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ ఫౌండర్ కొండా గంగరాజ్ కుమార్ ఆధ్వర్యంలో పూజారి సుధీరాచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వార్లను విశేషంగా అలంకరించి ముస్తాబు చేశారు. ఆలయంలో ప్రధాన హోమపూజలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

విద్యుత్, తాగునీటి సౌకర్యం

దెందులూరు: స్థానిక సీతంపేట కాల్వపై నివసిస్తున్న ఎనిమిది కుటుంబాలకు విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించారు. ఇప్పటి వరకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేక ఎనిమిది కుటుంబాల గత కొన్నేళ్ల నుంచి నానా ఇబ్బందులుపడ్డారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు మంగళవారం తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి స్ఫూర్తితో సీతంపేట వాసులకు కనీస అవసరాలైన తాగునీరు, విద్యుత్ కల్పించడం సంతోషంగా ఉందని ఏసుబాబు అన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

విజేతలకు బహుమతుల ప్రదానం



కస్తూరిబా హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవం



వైఎంహెచ్ఏలో తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్న భాషాభిమానులు



కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బహుమతులు అందుకున్న విద్యార్థులు



సత్రంపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల సాంస్కృతి కార్యక్రమం



సీఆర్ఆర్ కాలేజీలో మాట్లాడుతున్న వక్తలు

ఏలూరు (టూటౌన్): తెలుగు భాషా దినోత్సవాన్ని ఏలూరు నగరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామమూర్తి పంతులు, తెలుగు తల్లి చిత్రపటాలను పూలమాలతో అలంకరించారు. గిడుగు రామమూర్తి పంతులు జీవిత చరిత్ర, ఆయన నడిపిన వ్యవహార భాషోద్యమాన్ని గుర్తుచేసుకున్నారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుతులు అందజేశారు. కస్తూరిబా నగరపాలక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జి.సునీత ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుతులు ప్రదానం చేశారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు జిల్లా వీరభద్రరావు, రిటైర్డ్ డీవైఈఓ బాపూజీ, రిటైర్డ్ సీటీఓ ఉమామహేశ్వరరావు, రిటైర్డ్ పీఈటీ జి.జయపాల్‌లు మాట్లాడారు. పీఈటీలు కె.మురళీకృష్ణ, ఎంవీఎల్ ప్రసన్నలను సత్కరించారు. బాస్కెట్‌బాల్ టోర్నీకి ఎంపికయిన జాతీయ క్రీడాకారిణి పి.నందినికి వీరభద్రరావు రూ.1000 పారితోషికం అందజేశారు.

- సత్రంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష గొప్పతనాన్ని తెలిపే విధంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇన్‌చార్జి హెచ్ఎం నల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.
- కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల తెలుగు విభాగం, మాతృదేవోభవ సేవా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించారు. గిరిబాబు, తెలుగు అధ్యాపకుడు ఎస్ పరమేశ్, ఆనంద నాయుడు, సీడీసీ సభ్యుడు ఎల్ వెంకటేశ్వరరావు, కూచిపూడి సత్యనారాయణ, కె.అజయ్ కుమార్ మాట్లాడారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరించారు.గిడుగు రామమూర్తి సేవలను గుర్తుచేశారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.
- వైఎంహెచ్ఏ సెంటర్‌లో బీజేపీ ఏలూరు తూర్పు మండల అధ్యక్షుడు లక్కోజు అనిల్ ఆచార్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొరళ్ల సుధాకర కృష్ణ తెలుగు భాషా దినోత్సవాన్ని గురించి వివరించారు. ఏలూరు అసెంబ్లీ కన్వీనర్ గాది రాంబాబు, కోకన్వీనర్ బాడిత నారాయణరావు, మండల జనరల్ సెక్రెటరీ మహేష్ పాల్గొన్నారు.
- సీఆర్ఆర్ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆంగ్ల భాష సహాయ ఆచార్యులు నూజిళ్ల శ్రీనివాస్ మాట్లాడారు. పాలన, వ్యవహారిక భాషగా తెలుగును ఉపయోగించాలన్నారు. తెలుగు శాఖాధిపతి మేడసాని శ్రీనివాసరావు, అధ్యాపకులు బి.శంకర్, ఎస్ రవికుమార్, సీహెచ్ జాన్సన్ కెనడి, చరిత్ర శాఖాధిపతి కేఏ ఇమ్మానియేల్, రసాయన శాస్త్ర శాఖాధిపతి వీఏఎస్ సతీష్, ఆంగ్ల శాఖ అధ్యాపకులు కేఎస్‌సీహెచ్ చంద్ర శేఖర్, ఏండీఎం బాష, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.
- హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఏ) ఏలూరు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో సంఘం మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, కార్యనిర్వాహక కమిటీ ఉపాధ్యక్షుడు బీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, కమిటీ ఇన్‌చార్జి వేమా కోటేశ్వరరావు, జిల్లా రిజిస్ట్రార్, సాహితీవేత్త లంకా వెంకటేశ్వర్లు మాట్లాడారు. అమ్మభాష తెలుగుకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎల్ వెంకటేశ్వరరావు, నృత్య గురువు ఎ.పార్వతీ రామచంద్రన్, మోతే శ్రీనివాసరావు, ఆర్ఎస్ఆర్ నాగేశ్వరరావు, పిలగల కొండలరావు, ఎం.సూర్యనారాయణ, కె.హేమంత్ కుమార్, చన్నా వెంకటరామయ్య, కేవీ సుబ్బారావు, కె.రవి కుమార్ పాల్గొన్నారు.

తెలుగు భాష రక్షణకు ఉద్యమించాలి

ఏలూరు (టూటౌన్): తెలుగు భాష రక్షణకు ఉద్యమం సాగాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. స్థానిక పవరుపేటలోని ఏవీఆర్ విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సాబ్జీ మాట్లాడారు. రామమూర్తి పంతులు స్ఫూర్తితో తెలుగు భాష రక్షణకు పాటు పడాలన్నారు. విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు ఎస్ కస్తూరిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గిడుగు చిత్రపటానికి ఎమ్మెల్సీ సాబ్జీ, డాక్టర్ రావి గోపాలకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్రాంత బ్యాంకు మేనేజర్ వై.ఆనందనాయుడు, రావి పద్మ, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, సభ్యులు ఏబీ త్రిపుర సుందరి, మేతర అజయ్ బాబు, జి.శారద, జి.నీలిమ, కె.శ్రావణి కుమారి మాట్లాడారు. ఉపన్యాసం, పాటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

సేవల్లో లోపాలపై అర్జీ చేసుకోవచ్చు



సదస్సులో మాట్లాడుతున్న మేరీ గ్రేస్ కుమారి

ఏలూరు (టూటౌన్): రవాణా, పోస్టల్, బీమా, బ్యాంకింగ్, విద్యా, వైద్యం, జాతీయ ఉపాధి హామీ పథకం, రియల్ ఎస్టేట్ తదితర సేవల్లో లోపం ఉంటే శాశ్వత లోక్‌అదాలత్‌లో అర్జీ చేసుకోవచ్చని శాశ్వత న్యాయ పీఠం ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి తెలిపారు. స్థానిక న్యాయసేవాసదన్ భవన్‌లో మంగళవారం కొవ్వూరు, నిడదవోలు అధికారులకు శాశ్వత న్యాయపీఠం సేవలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ సేవాలోపం కేసుల్లో శాశ్వత న్యాయపీఠాన్ని ఆశ్రయించి ఉచిత న్యాయాన్ని పొందవచ్చని వివరించారు. కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ చేయడం లేదా సాక్షులను విచారించి తీర్పు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ ప్రక్రియ రెండు నెలల్లో పూర్తి చేస్తారని వివరించారు. ఈ తీర్పులకు అప్పీల్ ఉండదని, ప్రజలపై సేవల్లో లోపం ఉంటే తమను ఆశ్రయించవచ్చునని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పర్మినెంట్ లోక్ అదాలత్ సభ్యులు రామమోహన్‌రావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం

ద్వారకాతిరుమల: చిన వెంకన్న క్షేత్రంలో శ్రీవారి దివ్య పవిత్రోత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ యాగశాలలో అర్చకులు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, అజాప్రదీపారాధన, వాస్తుపూజ, మృత్సంగ్రహణ, అలాగే వాస్తు హోమం, పవిత్ర శుద్ధి జరిపారు. అనంతరం అంకురార్పణ నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం పవిత్రాదివాసాన్ని నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

పాలగూడెంలో అభివృద్ధి పరుగు



రూర్బన్ నిధులు రూ 40 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్



మల్కాపురంలో రూ 40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం

ఏలూరు రూరల్: ఏలూరు మండలం పాలగూడెం (మల్కాపురం) అభివృద్ధిలో పరుగులు తీస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల మన్ననలు పొందుతున్నాయి. పేదలకు పెద్దెత్తున సంక్షేమ పథకాల లబ్ధి చేకూరింది. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రత్యేక చొరవతో అధికారులు మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ప్రభుత్వం రూ.40 లక్షలతో సచివాలయ భవనం నిర్మించింది. రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.18.40 లక్షలతో పాల కేంద్రం మంజూరు చేసింది. రూ.40 లక్షల రూర్బన్ నిధులతో 90 కిలో లీటర్ల భారీ ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించారు. రూ.26 లక్షల జలజీవన్ మిషన్ నిధులు వెచ్చించి పైప్‌లైన్ ఏర్పాటుచేశారు. పేదల ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. టీడీపీ హయాంలో నిరుపయోగంగా మారిన కమ్యూనిటీ శానటరీ కాంప్లెక్స్‌ను రూ.3 లక్షలతో అభివృద్ధి చేశారు. ఎస్సీ, బీసీలు అధికంగా నివసిస్తోన్న ప్రాంతాల్లో రూ.60 లక్షలు ఖర్చు చేసి సీసీ రోడ్లు, ప్రధానరోడ్డు వద్ద డ్రెయినేజీ నిర్మించారు. జగనన్నకాలనీలో 118 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ప్రభుత్వం మంజూరు చేసింది. కాలనీలో ఇళ్ల నిర్మాణానికి విద్యుత్, రోడ్లు, తాగునీరు వసతి కల్పించారు.

పథకాలతో వెలుగు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నాయి. గ్రామంలో ఫించన్ దారులకు ప్రభుత్వం నెలకు రూ.8,66,000 అందిస్తోంది. అమ్మఒడి ద్వారా 410 మంది తల్లులు ఏడాదికి రూ.61,50,000 లబ్ధి చేకూరుతోంది. నాలుగేళ్లుగా ఏటా 66 మందికి జగనన్న చేదోడు ద్వారా రూ.6,60,000, వైఎస్సార్ చేయూత ద్వారా 172 మందికి రూ.32,25,000, వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా 51 గ్రూపుల్లో సభ్యులకు రూ.29 లక్షలు అందింది.

జగన్ పాలనపై నమ్మకం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల లబ్ధి ప్రజలకు చేరింది. పథకాలు గ్రామీణ జీవన స్థితిగతులను మార్చేశాయి. ప్రజలు ఆర్థికంగా బలపడుతూ సంతోషంగా జీవిస్తున్నారు. ముఖ్యమంత్రి మరో 20 ఏళ్ల సంక్షేమ పాలన అందిస్తారనే నమ్మకం ప్రతి ఒక్కరిలోనూ ఉంది.

– తూతా నిరంజన్, లబ్ధిదారు

అర్హులందరికీ పథకాలు



గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. నాయకులు ప్రమేయం లేకుండా ముఖ్యమంత్రి స్వయంగా ఆన్‌లైన్‌లో నేరుగా లబ్ధిదారులు ఖాతాల్లో నగదు జమ చేయడం ఎంతో మంచి ఆలోచన. ఇది పేదలకు ఎంతో మేలు చేస్తోంది. ఒక్కొక్క కుటుంబంలో ఒకరు లేక ఇద్దరు లబ్ధిదారులు ఉండడం విశేషం.

– పత్యాల సునీత, లబ్ధిదారు

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి



కోటేశ్వదుర్గాపురంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్ : రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలు పట్టం కడతారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. మంగళవారం సాయంత్రం ఏలూరు మండలం కోటేశ్వరదుర్గాపురంలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. పాదయాత్ర పేరుతో లోకేశ్, ప్రాజెక్టుల పరిశీలన పేరుతో చంద్రబాబు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టి ప్రజల మధ్య అగాధం సృష్టించి అధికారం చేజిక్కించుకోవాలని ఆశపడుతున్నారని అన్నారు. ఉద్యోగాలు పేరుతో యువతను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్న చంద్రబాబు మాటలను ఎవ్వరూ విశ్వసించరని తెలిపారు. ఎన్ని ఆర్థిక సమస్యలు ఎదురైనప్పటికీ సీఎం జగన్ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించారని గుర్తుచేశారు. అమ్మఒడి, జగనన్న భరోసా, వైఎస్సార్ ఆసరా, విద్యా దీవెన, జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం వంటి పథకాలు పేదల జీవితాల్లో ఎంతో మార్పు తెచ్చాయని వివరించారు. రానున్న ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాలతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, యువత మరోసారి వైఎస్సార్ సీపీకి విజయం కట్టబెడతారని చెప్పారు. ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓట్లేస్తారని అన్నారు. తొలుత ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. సచివాలయం, ఆర్బీకే, కల్వర్టు నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ వర్రి లక్ష్మీదుర్గ, ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుడు వర్రి నారాయణ, బాలకృష్ణ, పార్టీ మండల నాయకులు ముంగర సంజీవ్‌కుమార్, తేరా ఆనంద్, మండల కొండలరావు, బాపనయ్య, సర్పంచ్‌లు కొరపాటి ప్రభుదేవ్, పత్యాల సునీత, తెనాలి యోహాన్ మండల, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయండి



నోడల్ అధికారిని ఆధార్ సెంటర్ ఏర్పాటు కోరుతున్న ఎంపీపీ శ్రీనివాసరాజు

ఏలూరు రూరల్: ఏలూరు – కైకులూరు రోడ్డు పరిసర గ్రామాల ప్రజల కోసం ప్రత్యేక ఆధార్ సెంటర్ ఏర్పాటుచేయాలని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు కోరారు. మంగళవారం జిల్లా సచివాలయ నోడల్ అధికారి జి.రమణ ఏలూరు మండలపరిషత్ సమావేశ మందిరంలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు ఆధార్ నమోదు పక్రియపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసరాజు నోడల్ అధికారితో మాట్లాడుతూ మల్కాపురం, చాటపర్రు, గుడివాకలంక, పైడచింతపాడు సచివాలయాల్లో ఆధార్‌సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇదే క్రమంలో ఏలూరు – కైకులూరు రోడ్డు వైపు గ్రామాలైన మాదేపల్లి లేదా శ్రీపర్రు సచివాలయాల్లో ఒక ఆధార్ సెంటర్ ఏర్పాటు చేస్తే లింగారావుగూడెం, గురుకులపేట, మానూరు, మహేశ్వరపురం, కలకుర్రు ప్రజలకు దగ్గరగా ఉంటుందని వివరించారు. దీనిపై స్పందించిన రమణ స్థానిక సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు ప్రత్యేక పరీక్ష నిర్వహించి సెంటర్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ధరల అదుపులో కేంద్రం విఫలం



ప్రజా భేరిలో మాట్లాడుతున్న కిషోర్

ఏలూరు (టూటౌన్): ధరలను అదుపు చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం చేపట్టిన ప్రజాభేరి యాత్రను స్థానిక తంగెళ్లమూడి ప్రాంతంలో మంగళవారం ఉదయం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ నిత్యావసర సరుకుల ధరలన్నీ ఆకాశాన్నంటుతున్నాయని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ లీటర్ ధర రూ.40 నుంచి రూ.120కు, గ్యాస్ సిలిండర్ ధర రూ.450 నుంచి రూ.1200కు పెరిగిందన్నారు. పప్పు దినుసులు, వంట నూనె, కారం, చింతపండు, పంచదార అన్ని సరుకుల ధరలు భారీగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీని బీజేపీ నిలబెట్టుకోలేక పోయిందన్నారు. ఆర్మీ ఉద్యోగాలను సైతం బీజేపీ నాలుగేళ్లకే కుదించి కాంట్రాక్టీకరణ చేశారని వాపోయారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజల మధ్య మత విద్వేషాలు రేపుతోందని, దానికి మణిపూర్, హర్యానాల్లో జరిగిన అల్లర్లే ఉదాహరణ అని వివరించారు. వచ్చేనెల నాలుగో తేదీ వరకు ప్రజాభేరి నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.ఆదిశేషు, వి.సాయిబాబు, బి.జగన్నాధరావు, తదితరులు పాల్గొన్నారు.

కోనేరు రంగారావు సిఫార్సులు అమలు చేయాలి

దెందులూరు: దోసపాడు చేపల చెరువుల వద్దకు చేరుకుని మంగళవారం దళితులు కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దోసపాడులోని చెరువుల్లో తమకు హక్కు ఉన్న భూముల్లో చేపలను పట్టుకోనివ్వాలంటూ మంగళవారం చెరువుల్లోకి దిగి చేపలను పట్టుకున్నారు. చెరువులకు గండ్లు కొట్టారు. ఎన్నో ఏళ్లుగా తమకు న్యాయం చేస్తారని అధికారులు, ప్రజాప్రతినిధులు వద్దకు తిరిగి తిరిగి అలసిపోయామని వ్యవసాయ సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి పి.వెంకట్ అన్నారు. విషయం తెలుసుకున్న దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా బందోబస్తు నిర్వహించారు.

చదువు ద్వారా ఉజ్వల భవిష్యత్తు

పెదవేగి : వివిధ కారణాలతో చదువు మధ్యలో మానేసిన విద్యార్థులను గుర్తించి వారిని డ్రాప్ ఎన్రోల్ మెంట్ పథకం ద్వారా తిరిగి బడిలో చేర్పించేలా చర్యలు చేపట్టి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని పెదవేగి ఎంపీడీఓ గంజి రాజ్ మనోజ్ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఎంపీడీఓ వెల్ఫేర్ అసిస్టెంట్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ గ్రామాల వారీగా ఉన్న డ్రాపవుట్స్ వివరాల నివేదికల రూపంలో అందజేయాలని వెల్ఫేర్ అసిస్టెంట్లను ఆదేశించారు. డ్రాపవుట్స్ నివేదికను పునఃపరిశీలించి ఖచ్చితమైన రిపోర్ట్‌ను రూపొందిస్తామన్నారు. డ్రాపవుట్స్‌గా గుర్తించిన వారిని తిరిగి బడిలో చేర్పించడం లేదా వారికి ఇష్టమైన స్కిల్స్ నేర్పించడం, ఓపెన్ స్కూళ్లలో చేర్పించి వారందరికీ ఉజ్వల భవిష్యత్ కల్పించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉద్దేశమని ఎంపీడీఓ అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇద్దరు ఎంఈఓతో సమన్వయం చేసుకుని ఎంపీడీఓ రాజ్‌మనోజ్ పర్యవేక్షించారు.

టీటీడీ బోర్డు సభ్యుడు పెదబాబుకు అభినందనలు

నిడమర్రు: తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యునిగా నియమితులైన గాదిరాజు వెంకట సుబ్బరాజు (పెదబాబు)కు మంగళవారం పలువురు ప్రముఖులు ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ తిరుమల వెంకన్నకు సేవ చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గురువారం కొత్త బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందని ఆయన తెలిపారు. పెదబాబుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషన్‌రాజు భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాసరావు, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ (రుడా) ఛైర్మన్ మేడపాటి షర్మిలరెడ్డి తదితరులున్నారు.

పెదబాబును సత్కరించిన జెడ్పీటీసీ కోడే కాశి

టీటీడీ బోర్డు సభ్యునిగా నియమితులైన గాదిరాజు వెంకట సుబ్బరాజు (పెదబాబు)ను మంగళవారం నిడమర్రు జెడ్పీటీసీ కోడే కాశి, పెదనింద్రకొలను వైఎస్సార్ సీపీ శ్రేణులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రారంభించిన గడపగడపకు మన ప్రభుత్వం 200వ రోజు పూర్తవుతున్న సందర్భంగా శుక్రవారం పెదనింద్రకొలనులో నిర్వహించే కార్యక్రమానికి పెదబాబును ఆహ్వానించామని కోడే కాశి తెలిపారు. సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు, సొసైటీ అధ్యక్షుడు దాట్ల శివవర్మ, ఎంపీటీసీ చినిమిల్లి నరసింహులు, పార్టీ అధ్యక్షుడు కోడూరి రాంబాబు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	29
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	16

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	14
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	12
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	23
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	12
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	29
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	08.00	4794	రద్దు
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	29
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	31
ఏలూరు –తిరుపతి	16.00	4830	33



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఏలూరు

99122 20559
95055 08399
96408 32693

Office mail : tpgadvt@gmail.com